క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నంలో ప్రతిష్టాత్మకంగా పునర్నిర్మించిన రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సుమారు రూ.13.5 కోట్ల వ్యయంతో పూర్తిగా గ్రానైట్ రాళ్లతో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు తెలిపారు. 36 మంది వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 12న సుమారు 22 నూతన విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో సకల సౌకర్యాలతో వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ పెద్దపాళెం సుబ్బయ్య, ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టవిష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, కృష్ణపట్నం ఎస్సై అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు




మనుబోలు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 27 మంది చిన్నారులకు గూడూరు మున్సిపల్ కార్యాలయంలో జనన ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మడమనూరు, మనుబోలు సెక్టార్ల సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, రమణమ్మ జనన ధ్రువీకరణలు లేని ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించారు. చిన్నారులను తల్లిదండ్రులతో పాటు గూడూరుకు తీసుకెళ్లి జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించారు. జనన ధ్రువీకరణలు లేక ఆధార్‌కు నోచుకోక చిన్నారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రతి చిన్నారికి జనన ధ్రువీకరణలు మంజూరు చేయిస్తున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.


ఎడగారు సాగులో జాగ్రత్తలు పాటించాలి



ఇందుకూరుపేట: ఎడగారు సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో భూమిలోని ఉప్పు లవణాలు పైకి రావడం వల్ల నారు పెరికే సమయంలో తెగిపోతుందన్నారు. ఇలా తెగిపోకుండా ఉండేందుకు ముందుగా రెండు, మూడు సార్లు నీరు పెట్టి తీయాలని సూచించారు. మండల ఉద్యానశాఖాధికారి విశాల్ మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్) స్కీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ పథకం కింద 11 మంది నుంచి 100 మంది వరకు రైతులు గ్రూపులుగా ఏర్పడితే కోల్డ్‌స్టోరేజ్‌లు, మార్కెటింగ్ వసతులు సమకూర్చుకునేందుకు 75 శాతం సబ్సిడీ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు వివరించారు. ఏఏబీ సభ్యులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక


జీవన్‌కుమార్


ప్రజ్ఞ

ముత్తుకూరు: స్థానిక బలిజపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు నాల్గో తరగతి విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభకనబర్చిన ప్రజ్ఞ ఆత్మకూరు, జీవన్‌కుమార్ గండిపాళెం గురుకులంలో సీట్లు సాధించారని వివరించారు.

గడప గడపకు సంక్షేమ వెలుగులు


చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు): గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను పట్టించుకునే నాథుడే కరువవడంతో సంక్షోభంతో కొట్టుమిట్టాడారని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం ముదివర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా ఒక్క బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నారని తెలిపారు. ముదివర్తి సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.10.46 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. గడప గడపకు సంక్షేమ ఫలాలు చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని సైతం సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనపై ప్రజలు ఆలోచించి అండగా నిలవాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు అచ్యుత్‌రెడ్డి, విజయభానురెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మయ్య, శ్రీహరిరెడ్డి, సొసైటీ చైర్మన్లు ప్రసాద్‌రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ కాయల సౌందర్య, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ నిర్మలమ్మ, సురేంద్రరెడ్డి, కాగుల మస్తాన్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూత

తల్లిదండ్రులను కోల్పోయిన, దివ్యాంగులైన నలుగురు చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. ముదివర్తికి చెందిన ఆరికట్టి చాముండేశ్వరి, రాజేశ్వరి తల్లిదండ్రులను కోల్పోగా వారికి చెరో రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే దివ్యాంగులైన చిలకపాటి నాసీర్, పుష్పకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా నగదును బ్యాంకులో డిపాజిట్ చేసి బాండ్లను చిన్నారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జేడీ మహేశ్వరుడు

మనుబోలు: పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు కోరారు. స్థానిక పశు వైద్యశాలలో పశు వైద్యులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్టపరిహారం స్థానంలో కొత్తగా పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద పాడి పశువులకు గరిష్టంగా రూ.30 వేలు బీమా పొందవచ్చని తెలిపారు. ఇందుకు గానూ ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలు రూ.384, ఏపీఎల్ కుటుంబాలు రూ.960 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడేళ్ల వరకు బీమా చెల్లుబాటు అవుతుందన్నారు. అలాగే జీవాలకు రూ.6 వేల వరకు బీమా పొందవచ్చని తెలిపారు. ఇందుకు గానూ ఎస్సీ,ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలు రూ.36, ఏపీఎల్ కుటుంబాలు రూ.90 చెల్లిస్తే సరిపోతుందన్నారు. పాడి రైతులకు 60 శాతం సబ్సిడీపై పశు దాణామృతం సరఫరా చేస్తున్నామని తెలిపారు. పశువైద్యశాలలకు 130 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలను చేరవేశామని, వర్షాలు పడిన వెంటనే రైతులు పొలాల్లో చల్లుకోవచ్చన్నారు. మనుబోలు ఏడీ గురవారెడ్డి, టీం నోడల్ ఆఫీసర్ యశోద, మడమనూరు, వీరంపల్లి పశువైద్యులు సరిత, షరీఫ్, ఏహెచ్‌ఎల్, ప్యారా సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంల బదిలీ

పొదలకూరు : మండలంలోని నాలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇనుకుర్తి హెచ్‌ఎం పీ సుబ్బలక్ష్మి కండలేరు డ్యామ్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనంతమడుగు హెచ్‌ఎం సలూజారాణి వచ్చారు. మొగళ్లూరు హెచ్‌ఎం కే వసుంధర ఆత్మకూరు మండలం వాసిలికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కండలేరుడ్యామ్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి వచ్చారు. తోడేరు హెచ్‌ఎం పీ ప్రసూన రాపూరు మండలం వేపినాపికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సూళ్లూరుపేట మండలం శ్రీధనమల్లి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు వచ్చారు. మరుపూరు హెచ్‌ఎం రాజు నెల్లూరురూరల్ మండల ఆమంచర్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నావూరు హెచ్‌ఎం మురళి వచ్చారు.

నార్తురాజుపాళెం సచివాలయంలో తొలి రిజిస్ట్రేషన్


ఆస్తి హక్కుదారునికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న అధికారులు

కొడవలూరు: నార్తురాజుపాళెం సచివాలయంలో తొలిసారిగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌ను శుక్రవారం చేశారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో తొలిసారిగా స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ డీఐజీ వీ కిరణ్‌కుమార్, కోవూరు సబ్‌రిజిస్ట్రార్ పీ శ్రీనివాసరావు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి జీ జాలయ్య రిజిస్ట్రేషన్ పత్రాలను హక్కుదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఇప్పటి వరకు స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కోసం కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం స్థిరాస్తి కొనుగోలు, విక్రయదారులకు సౌలభ్యంగా ఉండేలా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని స్థిరాస్తి కొనుగోలు, విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సు



బుచ్చిరెడ్డిపాళెం: రెవెన్యూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సుధీర్ అన్నారు. మండలంలోని కాలయకాగొల్లులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నాలుగు అర్జీలు అందగా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణి, సర్వేర్ రమేష్, వీఆర్వో సుధ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం


గర్భిణులకు సూచనలు ఇస్తున్న బ్రిజిత

కొడవలూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ బ్రిజిత పేర్కొన్నారు. కొడవలూరు పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణులతో సమావేశమై ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చన్నారు. వైద్యులు కాన్పు తేదీని స్పష్టంగా తెలియజేయడం వల్ల పీహెచ్‌సీలోనే చేయించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. తద్వారా తల్లీబిడ్డ సురక్షితంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు 32 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి 8 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు మారంరెడ్డి నారసింహారెడ్డి, సుజాతమ్మ, శేషురెడ్డి, వర్షిణి, విష్ణుప్రియ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న చిల్లకూరు ప్రసూనమ్మ

తోటపల్లిగూడూరు: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ చిల్లకూరు ప్రసూనమ్మ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ముందుచూపు కారణంగా రబీ సీజన్‌లో రైతులు అధిక దిగుబడులను సాధించడంతో పాటు ఎన్నడూ లేని విధంగా మద్దతు ధరలను పొందారన్నారు. ఎడగారులోనూ రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలన్నారు. వ్యవసాయాధికారులు ఎడగారు సాగుకు సంబంధించి రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు ఎడగారు సాగుకు సంబంధించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ శిరీషారాణి, మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ఎడగారు సాగుకు సన్నద్ధం


నాటుకు నారుకట్టలు సిద్ధం చేస్తున్న కూలీలు

పొదలకూరు : మండలంలోని పెన్నార్ డెల్టా ఆయకట్టు రైతులు ఎడగారు సాగుకు సన్నద్ధం అయ్యారు. మండలంలో 30 పంచాయతీలు ఉండగా, పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలోని సూరాయపాళెం, విరువూరు, వెలికంటిపాళెం, నేదురుమల్లి, యర్రబల్లి, మహ్మదాపురం, తాటిపర్తి, డేగపూడి గ్రామాల్లో ఎడగారు కింద సుమారు మూడు వేల ఎకరాల్లో వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ధాన్యం ధరలు బాగా పలుకుతుండడంతో నాన్‌డెల్టా గ్రామాలైన డేగపూడి, చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి తదితర గ్రామాల్లోని రైతులు బోర్ల కింద ఎడగారు సాగుచేస్తున్నారు. ఇప్పటికే నార్లు పోసుకుని పొలం దమ్ము చేసుకున్న రైతులు నాట్లు వేయడంలో నిమ్మగ్నమయ్యారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న నెల్లూరు ఆర్డీఓ మలోల

బుచ్చిరెడ్డిపాళెం: రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నెల్లూరు ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మండలంలోని జొన్నవాడలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం క్రింద చేపడుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు వందేళ్ల క్రితం భూముల సర్వే చేపట్టారని గుర్తుచేశారు. ఈ కారణంగా నేడు భూ వివాదాలు నెలకొని రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. రీ సర్వే ద్వారా భూములకు హద్దులను చూపడంతో పాటు భూ సమస్యలను పరిష్కరించి రైతులు హక్కు పట్టాలను అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుధీర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.